
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
గురువారం 30 జనవరి 2025



పలువురు తహసీల్దార్ల బదిలీ

గజ్వేల్, జనవరి29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ మనుచౌదరి బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. నంగునూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరితను కుకునూరుపల్లికి, కుకునూరుపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న మల్లికార్జున్‌రెడ్డిని అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్‌గా, అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ పి.చంద్రశేఖర్‌ను గజ్వేల్ ఆర్డీవో కార్యాలయ డీఏవోగా, గజ్వే ల్ ఆర్డీవో కార్యాలయ డీఏవోగా పనిచేస్తున్న డి.సుజాతను నంగునూరు తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేసులో మేము సైతం..


మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోటాపోటీ

ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు

గ్రాడ్యుయేట్లను ఆకర్షించేలా ప్రచారం

టీచర్ల స్థానంపై పీఆర్‌టీయూ ఫోకస్

బీజేపీ అభ్యర్థుల ప్రకటన.. డైలమాలో కాంగ్రెస్, బీఆర్ఎస్



మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్‌తోపాటు అదేరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 27న పోలింగ్.. మార్చి 3న ఫలితాలు వెల్లడిస్తారు. ఈ నేపథ్యంలో ఆశావహులంతా నడుం బిగించారు. రేసులో మేమూ ఉన్నామంటూ ప్రచార ఆర్భాటాలపై దృష్టిపెట్టారు. ఇటు పట్టభద్రులను, అటు ఉపాధ్యాయులను ఆకర్షించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 29: నెలరోజుల పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల మైకులు మార్మోగనున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయులు విద్యావంతులే కావడంతో ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ ఆలోచనలను వెల్లడించడంతో పాటు పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాల వైఖరిపై ఓటు ద్వారా తమ తీర్పును ఇవ్వబోతున్నారు.

పట్టభద్రుల కోసం ప్రచారహోరు

గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆకర్షించడానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ రేసులో ఉన్నవారంతా విభిన్న శైలిలో ప్రచారం చేపట్టారు. గడిచిన ఆరునెలల కాలంగా ఫ్లెక్సీలు, సోషల్ మీడియా, పత్రికలు, ఛానళ్లలో తమ ప్రస్తావన ఉండేలా చూసుకుంటున్నారు. వివిధ ఫౌండేషన్ల ద్వారా నిరుద్యోగులను, యువతను ఆకర్షించే కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల లెక్చరర్లు, టీచర్లు, ఉద్యోగులు, యువతీ యువకులకు అవగాహన కల్పించారు. తమను గెలిపిస్తే చేపట్టబోయే అంశాల గురించి విప్పిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రధానంగా ప్రైవేట్ స్కూల్స్ టీచర్ల సంఘం ట్రస్మా నేత యాదగిరి శేఖర్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీ పోస్టుకు వీఆర్ఎస్ తీసుకున్న గంగాధర్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, ఐఎంఏ మాజీ ఛైర్మన్ డాక్టర్ బీఎన్ రావు రేసులో ఉన్నారు. మరోవైపు బీజేపీ తమ అభ్యర్థిగా ఆ పార్టీ నేత చిన్నమైలు అంజిరెడ్డిని ప్రకటించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులెవరోననే ఉత్కంఠ నెలకొంది.


ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై ఫోకస్

గత ఎన్నికల్లో సిద్దిపేటకు చెందిన కూర రఘోత్తమరెడ్డి పీఆర్‌టీయూ తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించారు. ఈసారి కూడా సిద్దిపేటకే చెందిన వంగ మహేందర్‌రెడ్డిపేరును ఆ సంఘం అభ్యర్థిగా ప్రకటించింది. ఇతర అనుబంధ సంఘాల మద్దతునూ కూడగడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో మెజార్టీ ఓటర్లు పీఆర్‌టీయూ సంఘ సభ్యులవే ఉంటాయనే ధీమాతో ఆయన ప్రచారం చేస్తున్నారు. మళ్లీ ఈస్థానాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇక విద్యాసంస్థల అధినేత

మిగతా 7వ పేజీలో..

ఓటర్ల వివరాలు ఇవే..

జిల్లా	ఉపాధ్యాయులు	పట్టభద్రులు
సంగారెడ్డి	2,621	23,500
మెదక్	1302	12,183
సిద్దిపేట	3,068	32,133
మొత్తం	6,991	67,816





సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ప్రీతి రఘునాథ్

కృత్రిమ మేధను అందిపుచ్చుకోవాలి

- గీతం సదస్సులో బ్రిటన్ షెఫీల్డ్ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ ప్రీతి రఘునాథ్

పటాన్‌చెరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేధ (ఏఐ), ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్‌ను భారతీయ విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, వ్యయప్రయాసలతో కూడినా వదులుకోకూడదని బ్రిటన్‌లోని షెఫీల్డ్ విశ్వవిద్యాలయంలో డిజిటల్ మీడియా అధ్యాపకురాలు డాక్టర్ ప్రీతి రఘునాథ్ అభిప్రాయపడ్డారు. 'తెలంగాణలో కృత్రిమ మేధ విధానాలు, మౌలిక సదుపాయాలు, అభ్యాసాలు ప్రారంభ ముద్రలు' అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తన పైలట్ పరిశోధన అధ్యయన ప్రారంభ ఫలితాలను వివరించారు. నిజామాబాద్, హైదరాబాద్ నుంచి రెండు కీలక కేస్ స్టడీలను ఆమె ప్రముఖంగా ప్రస్తావిస్తూ, తెలంగాణలో కృత్రిమ మేధ సంక్లిష్ట దృశ్యాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఉదాహరణలను జాతీయ, అంతర్జాతీయ ఏఐ అభివృద్ధి విస్తృత చట్రాలలో పరిశీలించారు. ఆర్థిక వృద్ధి, స్థిరమైన అభివృద్ధి మధ్య సమతుల్యత, ఏఐ ప్రపంచ కథనంలో స్థానిక సందర్భాలను గుర్తించడం ప్రాముఖ్యతలను ప్రస్తావించారు. తొలుత, జీఎస్ హెచ్ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ అతిథిని ఆహ్వానించి, విద్యార్థులకు పరిచయం చేశారు.

ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉచిత శిక్షణ

సంగారెడ్డి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బీసీ స్టడీ సర్కిల్‌లో వచ్చే నెల 15వ తేదీ నుంచి ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సులకు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.ప్రవీణ్ ఓ ప్రకటనలో తెలిపారు. వంద రోజుల శిక్షణ కోసం అర్హులైన సంగారెడ్డి, మెదక్ జిల్లాల అభ్యర్థులు ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాల కోసం 08455-277015, 9949592991 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శుల పనితీరు కీలకం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం

7



నేర సమీక్షలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేశ్

మాదకద్రవ్యాల నిర్మూలనలో సంగారెడ్డి జిల్లాకు గుర్తింపు

- నేర సమీక్షలో ఎస్పీ రూపేశ్

8

గిరిజన ఆశ్రమ పాఠశాలలో అధికారుల తనిఖీలు

8

బీఆర్ఎస్ గతం.. కాంగ్రెస్ ఖతం..
బీజేపీనే ప్రత్యామ్నాయం

ఎమ్మెల్సీ ఎన్నికలు బీజేపీ అధికారానికి సంకేతం

రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీలు డా.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


జహీరాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో త్వరలో జరుగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధిస్తారని, రాష్ట్రంలో భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తుందనడానికి ఈ ఎన్నికలే సంకేతమని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్‌ది గత చరిత్ర అని.. ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ విఫలమైనందుని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీయే ప్రత్యామ్నాయమని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు అభ్యర్థులే లేరని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులను కేటాయిస్తూ రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతోందన్నారు. 60 ఏళ్లల్లో జరగని అభివృద్ధి ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో జరిగిందన్నారు. రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో 2.లక్షల ఉద్యోగాలిస్తానని హామీ ఇచ్చినా కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ 317 జీవోను తీసుకువచ్చి ఉద్యోగులను విడదీసిందని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ప్రధాని పే-రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయగా, రాష్ట్రంలో అలాంటి ఊసేలేదన్నారు. కేంద్రం రాష్ట్రానికి వివిధ ప్రాజెక్టులను మంజూరు చేసిందని గుర్తుచేశారు. నిజామాబాద్‌కు పసుపుబోర్డు, ఏయిమ్స్, జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే రంగం తదితర అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, బీజేపీ సీనియర్ నేత శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సదాశివపేట: రాజ్యసభ సభ్యుడు డా. లక్ష్మణ్, చెవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సదాశివపేటలో బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

పుణ్యస్నానం..
వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

- భక్తిశ్రద్ధలతో మాఘ అమావాస్య
- నదీ స్నానాలు, ఆలయ దర్శనాలకు పోటెత్తిన భక్తులు
- భక్తజన సంద్రమైన ఏడుపాయల
- కిక్కిరిసిన కూడవెల్లి

7





విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

లక్ష్య సాధనకు శ్రమించాలి

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఆమె, అదనపు కలెక్టర్ మాధురితో కలిసి రాత్రిబస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ తమ విద్యాభ్యాసం, ఉద్యోగ సాధన అనుభవాలను వివరించారు. ఐఐటీలో సీటు సాధించేందుకు, ఐఏఎస్ ర్యాంకు కోసం తాను సిద్ధమైన విధానాన్ని కలెక్టర్ వివరించారు. ప్రజలకు సేవచేయడం కోసమే తాను ఐఏఎస్ కోసం శ్రమించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ మాధురి తాను వివాహం అనంతరం పిల్లలను చూసుకుంటూనే గ్రూప్‌వన్ సాధించిన తీరును వివరించారు. వివిధ కోర్సులు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గురుకులంలో వసతులను తనిఖీ చేశారు.

పైసలు సరిపోవు..
భవనాలు పూర్తికావు

- జిల్లాలో కొత్త ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలకు గ్రహణం
- మంజూరు 124.. పూర్తయినవి 21
- ఒక్కో కేంద్రానికి రూ.20 లక్షల చొప్పున కేటాయింపు
- ఆ నిధులు సరిపోవని కొత్తగా ప్రతిపాదనలు
- రెండేళ్లుగా పనులకు బ్రేక్

సంగారెడ్డి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాలకు గ్రహణం పట్టుకుంది. గ్రామీణ, పట్టణ మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను నెలకొల్పింది. వీటికి సొంత భవనాలు నిర్మించేందుకు మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులు కేటాయించింది. అయితే, భవనాలు పూర్తి చేసేందుకు కేటాయించిన ఈ నిధులు సరిపోకపోవడంతో నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

మూడేళ్ల క్రితం ఉత్తర్వులు

సంగారెడ్డి జిల్లాలో 246 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇందులో 124 కేంద్రాలకు పక్కా భవనాలను మంజూరు చేస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ 2022 మే 31న ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా 124 ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తూ అప్పటి కలెక్టర్ అదే ఏడాది జూలై 10న పాలనాపరమైన అనుమతి ఇచ్చారు. భవనాల నిర్మాణాలను వివిధ ప్రభుత్వ ఏజెన్సీలకు కేటాయించారు. ఇందులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం 81 ఆరోగ్య కేంద్రాలు, టీజీఎంఎస్ఐడీసీ 9, డీఆర్డీఏకు 34 భవనాల నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. కానీ పలుచోట్ల నిర్మాణాలు ప్రారంభమే కాకపోగా.. మొదలు పెట్టినవి కూడా నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఒక్కో భవన నిర్మాణం పూర్తి చేయాలంటే కనీసం రూ.28 లక్షల నిధులు

మిగతా 8వ పేజీలో..



సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో పిల్లర్ల స్థాయిలో నిలిచిన ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణం

దైవదర్శనానికి వెళ్తూ.. మృత్యుఒడికి

- కల్వర్టును ఢీకొన్న కారు.. ముగ్గురి దుర్మరణం
- ఆరుగురికి తీవ్రగాయాలు
- పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి శివారులో ప్రమాదం
- మృతులు సిద్దిపేట జిల్లా వాసులు
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ గ్రామశివారు కాట్నపల్లిలో కల్వర్టును ఢీకొన్న కారు

సుల్తానాబాద్ , జనవరి 29: (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళుతున్న వారిని రోడ్డుప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఆలయ దర్శనానికి బుధవారం తెల్లవారుజామున ఓ కుటుంబం కారులో బయలుదేరింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి శివారులో కారు కల్వర్టును ఢీకొంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సిద్దిపేటలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఆకుల కనకయ్య (60) ఆయన భార్య తార (50)తో పాటు వారి కుమారుడు ఆకుల శ్రీనివాస్, వియ్యంకుడు జంగిటి జనార్దన్ (45) ఆయ న భార్య రమాదేవి, వీరి కుమారుడు జంగిటి మనోజ్‌కుమార్, ఆకుల మాన్విత, ఆకుల ఆర్యన్ దైవదర్శనం కోసం బయలుదేరారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై కారు కల్వర్టును ఢీకొంది. వేగంగా ఢీ కొనడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారు ముందు సీట్లలో కూర్చున్న ఆకుల కనకయ్య, తార దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జంగిటి జనార్దన్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆకుల శ్రీనివాస్, రమాదేవి, ఆర్యన్, మాన్విత, మనోజ్‌కుమార్‌తో పాటు డ్రైవర్ బాల్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరండి

నర్సాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మామూలుగా ప్రైవేటు కాలేజీల వారు తమ కాలేజీలలో చేర్పించాలంటూ ప్రచారం చేయడం తెలుసు. కానీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు కూడా విద్యార్థులను చేర్పించుకోవడానికి ప్రచారం చేయడం విశేషం. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దామోదర్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం బుధవారం ప్రచారం ప్రారంభించారు.

ప్రారంభానికి పోచమ్మ ఆలయం సిద్ధం

పెద్దశంకరంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దశంకరంపేట ప్రియాంక కాలనీలో నిర్మించిన పోచమ్మ ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈనెల 30, 31వ తేదీల్లో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 30న గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, నవగ్రహ పూజలు, 31న యంత్ర ప్రతిష్ఠాపన అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాలుంటాయన్నారు.

కారు బీభత్సం

- మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్
- ద్విచక్రవాహనదారులకు గాయాలు

జోగిపేట, జనవరి29(ఆంధ్రజ్యోతి): జోగిపేటలో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు మొగులయ్య బొడ్మట్‌పల్లి నుంచి సంగారెడ్డికి తన సొంత కారులో బయలుదేరాడు. కారును జోగిపపేటకు చెందిన డ్రైవర్ మూసా నడుపుతున్నాడు. జోగిపేట పట్టణంలోని హనుమాన్ చౌరస్తా వద్దకు రాగానే మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ వేగంగా, అజాగ్రత్తగా కారును నడుపుతూ రెండు ద్విచక్రవాహనాలు ఢీకొడుతూ, రాంగ్‌రూట్‌లో వెళ్లి టీడీపీ జెండా గద్దెను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనాలపై వెళ్తున్న సంజీవులు, బాలయ్య, రాజు అనే వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పాండు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు

వ్యక్తిపై పోక్సో కేసు

ఐడీఏబొల్లారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయ మాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన ఓ కార్మికుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పెద్ద కోడప్గల్ గ్రామానికి చెందిన కడారి తరుణ్(20) ఐడీఏబొల్లారం చర్చి బస్తీలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా ఓ బాలికకు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సోతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జపాన్‌లో సైన్స్ ప్రోగ్రాంలో బీవీఆర్ఐటీ విద్యార్థులు

నర్సాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీకి చెందిన మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ చెందిన విద్యార్థులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రోగ్రాంలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె పేర్కొన్నారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ స్పాన్సర్ చేసిన సకురా సైన్స్ ఎక్స్ఛేంజీ ప్రోగ్రాంను విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. విద్యార్థుల బృందాన్ని ఛైర్మన్ విష్ణురాజు, వైస్ ఛైర్మన్ రవిచంద్రన్, సెక్రటరీ ఆదిత్య, డీన్ రాజుఏద్లా, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ అభినందించినట్లు చెప్పారు.

పుల్లూరు బండపై జాతర..

సిద్దిపేట రూరల్,జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు బండ పై జాతర మొదటి రోజున భక్తులు పోటెత్తారు. గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వయంభూ శ్రీ లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా బండ పైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.





ఏడుపాయల వద్ద మంజీరాలో భక్తుల పుణ్యస్నానాలు



దుబ్బాక : కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

- భక్తిశ్రద్ధలతో మాఘ అమావాస్య పర్వదినం
- ఆలయాల కోనేర్లలో భక్తుల పుణ్య స్నానాలు
- ఏడుపాయల, కూడవెల్లిలో కిక్కిరిసిన భక్తులు
- దర్శనం కోసం బారులు



ఏడుపాయలలో..

పాపన్నపేట/దుబ్బాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అత్యంత పవిత్రంగా భావించే మాఘ అమావాస్య పర్వదినం సందర్భంగా బుధవారం ఏడుపాయల వనదుర్గామాతను లక్షలాది భక్తులు దర్శించుకున్నారు. ఏడుపాయలుగా చీలి గలగలపారే నదీ పాయల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివచ్చారు. సింగూరు నుంచి వదిలిన నీరు ఘనపురం ఆనకట్టకు చేరుకున్నది. అక్కడి నుంచి దిగువకు వదలటంతో ఏడుపాయల్లో మంజీర పరవళ్లు తొక్కింది. తనకట్ట దిగువన చెక్‌డ్యాం వద్ద, నదీపాయల పొడవునా భక్తులు పుణ్యస్నానాలాచరించారు. అనంతరం అమ్మవారి దర్శనం కోసం మూడు గంటలు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఒడిబియ్యం, బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఏడుపాయల ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ



ఏడుపాయలలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బందోబస్తు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను మెదక్ అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. పుణ్యస్నానాలు చేసే పాయల వద్ద ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్ల విధులు నిర్వహించారు. మెదక్, నర్సాపూర్ మీదుగా ఏడుపాయలకు ప్రత్యేక బస్సులు నడిపించారు. అడుగడుగునా దుకాణ సముదాయాలు వెలిశాయి. సంతాన గుండంలో సంతానం లేని దంపతులు పుణ్యస్నానాలు ఆచరించారు. దారులన్నీ ఏడుపాయల వైపే అన్న విధంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు రావడం కనిపించింది. భక్తులకు ఆలయ పూజారులు ఆశీర్వచనాలు అందించి, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. లడ్డూ కౌంటర్ల ద్వారా భక్తులు ప్రసాదాన్ని కొనుగోళ్లు చేసుకోవడానికి బారులు తీరారు.

కూడవెల్లి.. ప్రణమిల్లి..

అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలోని కూడవెల్లి రామలింగేశ్వరాలయం గురువారం జనసంద్రమైంది. మాఘమాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున మూడు గంటల నుంచే పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారేలోగా భూంపల్లి చౌరస్తానుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు వాహనాలు నిలిచిపోయాయి. ఆలయానికి చేరుకునే పలు రహదారులు వాహనాల రద్దీతో నిండాయి. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు. భూంపల్లి కమాన్ నుంచి ఆలయం వరకు వాహనాలు వెళ్లాలంటే సుమారు గంట సమయం పట్టింది. దీంతో భక్తులు తమకు వీలున్నచోట ఖాళీ స్థలంలోనే వాహనాలకు నిలిపి రెండు కిలోమీటర్ల కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాకేత్‌శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్వామివారిని దర్శించుకున్నారు.



రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

నీట మునిగి భక్తుడు మృతి..

దుబ్బాక మండలం పెద్దగొండవెల్లికి చెందిన బిట్ల శివరాములు(65) బుధవారం తెల్లవారుజామున కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద పుణ్యస్నానం ఆచరిస్తుండగా మూర్ఛవ్యాధితో నీటిలో మునిగి మృతిచెందాడు. పోలీసులు ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● మర్కుక్ : కూడవెల్లి వాగు జన్మస్థలమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి పెద్ద చెరువుకు గ్రామస్థులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. రామేశ్వరంగ్రామంలోని కూడవెల్లివాగు జాతర ప్రారంభమైన సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పాపన్నపేట: పుణ్యస్నానాల ఆచరిస్తున్న భక్తులు



కూడవెల్లి రామలింగేశ్వరుడి ఆలయంలో భక్తుల పూజలు

అఘోరిపై కేసు నమోదు

చేర్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ సందర్శనార్థం వచ్చిన మహిళా అఘోరి తల్వార్‌తో హల్‌చల్‌చేసిన విషయమై సిద్దిపేట సీపీ అనూరాధ సీరియస్ అయ్యారు. తల్వార్‌తో దాడి చేసిన సంఘటనలో గ్రామానికి చెందిన యాదగిరి గాయాలపాలవడంతో పాటు వీడియో జర్నలిస్ట్ ఫోన్ ధ్వంసమైన విషయం విధితమే. ఈమేరకు సిద్దిపేట సీపీ అనూరాధ స్పందించి మహిళా అఘోరిపై కేసు నమోదుకు ఆదేశాలిచ్చారు. దీంతో కొమురవెల్లి పోలీసులు నాలుగు సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. అఘోరి మల్లన్న దర్శనానికి రావడం, అనూహ్యంగా దాడికి పాల్పడడం, పోలీసుల కేసునమోదు కావడం చర్చనీయాంశమైంది.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శుల పనితీరు కీలకం

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ అభివృద్ధిలో కార్యదర్శుల పనితీరు కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డివిజనల్, మండల స్థాయి పంచాయతీ అధికారులు, సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నిత్యం నిర్వహించే శానిటేషన్, ఇంటి పన్ను వసూలు, తనిఖీలు, ట్రేడ్ లైసెన్స్, సెల్‌టవర్ లైసెన్స్, ఇంటి అనుమతులు, మల్టీపర్పస్ వర్కర్స్ జీతాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో కార్యదర్శుల పనితీరు హర్షనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో కొనసాగించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్, డీపీవో యాదయ్య, సంబంధిత అధికారులు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నలుగురు మెదక్ ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మహిళా స్త్రీశిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, వైద్యారోగ్యశాఖ సమన్వయంతో బుధవారం స్థానిక టీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ఉచిత బ్యాటరీ ట్రై సైకిల్ ఎంపిక, కృత్రిమ అవయవాల కొలతల శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో హైమావతి, డీఆర్డీవో శ్రీనివాసరావు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



జనసంద్రమైన సింగరాయ

● కిటకిటలాడిన మోయ తుమ్మెదవాగు

కోహెడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్, గ్రామాల పరిధిలోని ప్రతాప సింగరాయ (లక్ష్మీనర్సింహస్వామి) ఆలయం జనసంద్రమైంది. బుధవారం పుష్య బహుళ అమావాస్య రోజును పురస్కరించుకుని నిర్వహించిన స్వామివారి జాతర భక్తులు భారీగా తరలివచ్చారు. ఈసారి రెవెన్యూ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు వేకువజామునే జాతరకు వచ్చి తూర్పు నుంచి పడమరకు ప్రవహించే మోయతుమ్మెద వాగు, ఇక్కడి గాజులబండ గుండంలో స్నానాలు చేశారు. నడకదారిన ఎత్తు వంపులు గల కొండలు ఎక్కి గుహలో కొలువుదీరిన లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులుదీరారు. ఒకేసారి భక్తులు తోసుకురావడంతో పలువురు మహిళలు కిందపడ్డారు. ఇద్దరు యువతులు అస్వస్థతకు గురయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాస్, కోహెడ ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ప్రతాపరుద్ర లక్ష్మీనరసింహస్వామికి మొక్కుతున్న యువతి



వంట చేస్తున్న మహిళ, స్నానం ఆచరిస్తున్న భక్తులు, సొమ్మసిల్లిన యువతికి సపర్యలు

రేసులో మేము సైతం..

(5వ పేజీ తరువాయి)

మల్కా కొమురయ్యను బీజేపీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. బీజేపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం, ఇతర టీచర్లపై ఆశలు పెట్టుకున్నారు. సిద్దిపేటకు చెందిన బడ్జెట్ పాఠశాలల సంఘం రాష్ట్ర కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి సైతం బరిలో ఉన్నారు. ప్రైవేట్ టీచర్ల మద్దతును ఆశిస్తున్నారు. టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా టీపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్‌ను ప్రకటించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులెవరో?

బీజేపీ పార్టీ తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించింది. కాగా రాష్ట్రంలో అధికార పార్టీగా ఉన్న కాంగ్రెస్ తమ అభ్యర్థులపై స్పష్టం చేయలేదు. కాంగ్రెస్ మద్దతు కోసం పలువురు ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఆశీస్సులు ఎవరికి ఉంటాయో రేపోమాపో తేటతెల్లం కానున్నది. కాగా పట్టభద్రుల స్థానం నుంచి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ స్థానాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉండగా.. బీఆర్ఎస్ కూడా అదే స్థాయిలో పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తోంది. తమ అభ్యర్థులుగా యాదగిరి శేఖర్ రావు, బీఎన్ రావు, సర్దార్ రవీందర్‌సింగ్ పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాబోయే రెండుమూడు రోజుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతిచ్చే అభ్యర్థులెవరో స్పష్టం కానున్నది.

మాదకద్రవ్యాల నిర్మూలనలో జిల్లాకు గుర్తింపు: ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో పోలీసు అధికారుల కృషి అభినందనీయమని ఎస్పీ రూపేష్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం జిల్లాస్థాయి నేర సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో మున్ముందు మరిన్ని మంచి ఫలితాలు రాబట్టి డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చడానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఆల్ర్పాజోలం కేసులో ముఠాను పట్టుకొని, సుమారు రూ.60 కోట్ల విలువగల ఆస్తులను గుర్తించినందుకుగాను సంగారెడ్డి జిల్లా పోలీసుశాఖను రాష్ట్ర నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్/డీజీ సందీప్ శాండిల్యా అభినందించారన్నారు. ఈ కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులకు రివార్డులను అందజేశారు. అలాగే విపరీతంగా పెరిగిన డయల్ 100 కాల్స్ ద్వారా, ట్యాబ్‌ల టెక్నికల్ సమస్యల వల్ల ఎదుర్కొంటున్న సమస్యను అధిగమించడానికి అన్ని పోలీస్ స్టేషన్లకు 20 నూతన ట్యాబ్‌లను ఎస్పీ అందజేశారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులను నిర్వహించడానికి 10 బ్రీత్ అనలైజర్ కిట్లను, ఐదు హ్యాండ్ కెమెరాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఏ.సంజీవరావ్, సంగారెడ్డి డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు విజయ్‌కృష్ణ, రమేష్, కిరణ్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

న్యూస్ బాక్స్

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి: డీఎస్పీ

నారాయణఖేడ్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఖేడ్ ఆచార్య జయశంకర్ డిగ్రీ కళాశాలలో స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ ప్రశ్నాపత్రాల సీలు విప్పి అందజేశారు. ఈ పరీక్షల్లో తదుపరి కోర్సు పూర్తయ్యే వరకు ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.10 వేలు, ద్వితీయ ర్యాంకుకు రూ.5 వేలు అందజేస్తారన్నారు.

టెక్-బీలో ప్రవేశాలకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్ బీ ప్రోగ్రాం-2025లో ప్రవేశాలకు ఇంటర్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఐఈవో గోవిందరామ్ తెలిపారు. ఇంటర్ ఈ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఏడాది శిక్షణ అనంతరం హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 7981834205 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రెడ్డి



సంగారెడ్డి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ భవన నిర్మాణ కార్మికుల ద్వితీయ మహాసభలో సంగారెడ్డికి చెందిన మోహన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనను ఎన్నుకున్న జాతీయ, రాష్ట్ర బీఎంఎస్ నాయకులకు మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా జయరాజ్

సంగారెడ్డి రూరల్: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గొల్లపల్లి జయరాజ్‌ను మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జయరాజ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు జయరాజ్ కృషి చేశారు. సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా సేవలందిస్తున్న జయరాజ్‌కు రాష్ట్ర కమిటీలో అవకాశం రావడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుబ్బాక ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే

చేగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చేగుంట మండలం కర్నాల్‌పల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మతల్లి కల్యాణోత్సవంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి ముక్కుపుడక బహూకరించి మాట్లాడారు. ఎల్లమ్మతల్లి కృపాకటాక్షం దుబ్బాక ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ మోదాం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య,

నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాస్

● బీఆర్ఎస్ నర్సాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు

నర్సాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎమ్మెల్యేనే బాస్ అని, ఏ పదవులు లేని అధికార కాంగ్రెస్ నాయకులు అధికారిక కార్యక్రమాల్లో రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉన్నదని బీఆర్ఎస్ నర్సాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు ఖండించారు. బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, రామాగౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, సీనియన్ నాయకుడు సత్యంగౌడ్, టీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు రాజేందర్‌నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయీం, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి విలేకరులతో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఆంజనేయులుగౌడ్‌తో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డిలు ఎమ్మెల్యే సునీతారెడ్డిపై అడ్డగోలుగా విమర్శలు చేయడంపై తీవ్రంగా ఖండించారు. మరోసారి ఎమ్మెల్యేపై ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే నాయకులను ఎక్కడికక్కడ నిలదీస్తామని తెలిపారు. నాయకులు జీతేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామంచందర్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తదితరులు

ఉనికిని కాపాడుకునేందుకే కాంగ్రెస్‌పై విమర్శలు

శివ్వంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో ఆదరణ కోల్పోతున్న బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేక రాజకీయంగా ఉనికిని కాపాడుకునేందుకే నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవీన్‌గుప్తా విమర్శించారు. బుధవారం ఆయన శివ్వంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అధికారులు


● విద్యార్థుల భోజనంపై ఆరా

పుల్‌కల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై అధికారులు ఆరాతీశారు. వసతి గృహంలో భోజనం బాగాలేదంటూ విద్యార్థులు రెండురోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, చౌటకూర్ తహసీల్దార్ మన్నె కిరణ్ కుమార్‌లు మంగళవారం రాత్రి సందర్శించగా, ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగం బుధవారం వేర్వేరుగా సందర్శించారు. భోజన విషయమై విద్యార్థులను అడగ్గా.. తరచూ అన్నం మెత్తగా ఉడికించి పెడుతున్నారని, తినలేకపోతున్నామన్నారు. ఉప్పు నీరుతో వండడంతో మెత్తగా అవుతుందని వంట మనుషులు చెప్పారు. వసతి గృహానికి మంజీర కనెక్షన్ ఉన్నప్పటికీ, నీటి సరఫరా కావడం లేదని, 24 గంటల పాటు మంజీర జలాలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం వెండికోల్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.


బొమ్మారెడ్డిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న రామలింగం

ఉపాధిహామీ సిబ్బంది వేతనాలు మంజూరు చేయండి

అల్లాదుర్గం/నాగల్‌గిద్ద/మెదక్/జహీరాబాద్/తూప్రాన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మూడునెలలుగా వేతనాలు మంజూరు చేయకపోవడంపై బుధవారం అల్లాదుర్గం ఈజీఎస్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈజీఎస్ ఏపీవో సుధాకర్‌తో పాటు సిబ్బంది మాట్లాడుతూ మూడునెలలుగా వేతనాలు మంజూరుకాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాగల్‌గిద్ద మండల ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఎంపీడీవో మహేశ్వర్‌రావుకు, చిన్నశంకరంపేటలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధిహామీ పథకం కార్యాలయంలో ఏపీవో రాజ్‌కుమార్‌కు, జహీరాబాద్ పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహేందర్‌రెడ్డికి ఉపాధిహామీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. తూప్రాన్ మండల ఉపాధిహామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది వేతనాలను చెల్లించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.


అల్లాదుర్గం ఎంపీడీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఈజీఎస్ ఏపీవో, సిబ్బంది

క్రీడల్లో విద్యార్థులు ప్రతిభచాటాలి

● రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల ప్రారంభంలో డీఈవో డాక్టర్ రమేష్


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రసంగిస్తున్న డీఈవో రమేష్

తూప్రాన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను రాష్ట్రస్థాయిలో చూపించాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. 68వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ 2024-25 చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య అంటే చదువు ఒక్కటే కాదని, క్రీడలూ ముఖ్యమన్నారు. పాఠశాలల్లో చదివే ఇతర విద్యార్థులను కూడా క్రీడల్లో పాల్గొనేవిధంగా ప్రోత్సహించాలని సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గంగాల కార్యక్రమానికి అధ్యక్షతన వహించారు. ఎంఈవో పర్వతి సత్యనారాయణ, జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, క్రీడోత్సవాల పరిశీలకులు గంగామోహన్, రవికుమార్, టోర్నమెంట్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్‌శర్మ పాల్గొన్నారు. ఉమ్మడి పది జిల్లాల్లో హైదరాబాద్ మినహా ఇతర జిల్లాలకు చెందిన 300 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్, మేనేజర్లు పాల్గొన్నారు.

సామర్థ్యాన్ని గుర్తిస్తూ చదువుకునేలా ప్రోత్సహించాలి: డీఈవో

జిన్నారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ప్రతిభను చాటేలా చదవుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గడ్డపోతారం ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని, అధ్యాపకుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు, పాఠ్యాంశాల తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షల్లో 10జీపీఏ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. అనంతరం కాజీపల్లిలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించినపాఠశాల భవనాన్ని డీఈవో పరిశీలించి, అక్కడ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కుమారస్వామి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, అనిల్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో అగ్ని ప్రమాదం

● చిరువ్యాపారుల దుకాణాలు దగ్ధం

నారాయణఖేడ్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు చిరు వ్యాపారుల దుకాణాలు దగ్ధమై, రూ.2 లక్షల వరకు నష్టం జరిగింది. పట్టణంలోని రాజీవ్‌చౌక్ సమీపంలో రాయిపల్లి రోడ్డు పక్కన పలువురు వ్యాపారులు డబ్బాలు, షెడ్లు, పూరిపాకలు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. తెల్లవారు జామున అకస్మాత్తుగా మంటలు చెలరేగగా అటుగా వెళ్తున్న స్థానికులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గమనించి కొన్ని డబ్బాలను రోడ్డుపై తెచ్చి కాలి పోకుండా కాపాడగా.. అప్పటికే నాలుగు దుకాణాలు కాలిపోయాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. వారు వచ్చి మంటలు ఆర్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మెదక్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన ముంద్రాతి చిన్నరాములు(45) సోమవారం రాత్రి గవ్వలపల్లి నుంచి గజగట్లపలికి స్కూటీపై వస్తున్నాడు. సంగాయిపల్లి గ్రామ శివారు బీటీ రోడ్డుపై ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య పుష్ప, కూతురు బాలమణి ఉన్నారు. కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

పైసలు సరిపోవు... భవనాలు పూర్తికావు

5వ పేజీ తరువాయి

అవసరమవుతాయని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే విషయం ఉన్నతాధికారులకు నివేదించినా కానీ ఇప్పటి వరకు నిధుల పెంపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల నిర్మాణాల వ్యయాన్ని పెంచితే తప్పా కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనిచేసి భవనాలు అప్పగించే పరిస్థితి లేదు.

అసంపూర్తిగానే

నిధుల కొరతతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంకు కేటాయించిన 81 ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఇప్పటి వరకు 21 కేంద్రాల నిర్మాణాలు మాత్రమే పాక్షికంగా పూర్తయ్యాయి. మరో 28 కేంద్రాలు నిర్మాణ దశలో ఉండగా, 32 కేంద్రాలు ఇంకా ప్రారంభించనేలేదు. 36 కేంద్రాలు కూడా డబ్బులు లేవన్న కారణంతో పనులు చేసేందుకు కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. డీఆర్డీఏకు కేటాయించిన 34 ఆరోగ్య ఉప కేంద్రాలను స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. ఇందులో 7 కేంద్రాల భవనాల నిర్మాణాలను ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా ఒక్కటీ పూర్తికాలేదు. మిగిలిన 27 కేంద్రాలకు భవన నిర్మాణాలను మొదలు పెట్టనేలేదు. వీటి పనులు ప్రారంభించాలని ఒక్కో కేంద్రంకు రూ.2 లక్షల చొప్పున స్వయం సహాయక సంఘాలకు అడ్వాన్సుగా అప్పటి కలెక్టర్ విడుదల చేసినా వారు ముందుకు రావడంలేదు. ఇలా ఉండగా స్థలం కేటాయించకపోవడంతో టీజీఎంఎస్ఐడీసీకి కేటాయించిన తొమ్మిది ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలను ఇప్పటి వరకు చేపట్టలేదు. పైసలు లేకుండా పనులు ఎలా చేపడతామంటూ కాంట్రాక్టర్లు ఎదురు ప్రశ్నిస్తున్నారని ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పూర్తయిన పనులకు సంబంధించి రూ.1.45 కోట్ల నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నతాధికారులకు లేఖ పంపినా ఇప్పటి వరకు స్పందన లేదని వివరించారు.

ప్రయాణికుల భద్రతే డ్రైవర్ల లక్ష్యం కావాలి: ఆర్ఎం

సంగారెడ్డి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల భద్రతే డ్రైవర్ల లక్ష్యం కావాలని ఆర్టీసీ ఆర్ఎం ప్రభులత సూచించారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపోలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం రీజియన్ లెవల్‌లో యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లు, డిపో లెవల్‌లో జీరో యాక్సిడెంట్ డ్రైవర్లను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంగారెడ్డి డీఎం ఉపేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంవీఐ అరుణ, ఎఎంవీఐలు గౌతమ్, శిరీష, ఇన్‌చార్జి డిప్యూటీ ఆర్ఎం జాకీర్‌హుస్సేన్, ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో బడికి శౌచాలయాలు

● రూ.55 వేలతో నిర్మించి ఇచ్చిన దాతలు

సంగారెడ్డి అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి రాజంపేటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యనభ్యసించే సుమారు 145 మంది విద్యార్థులు కొన్నేళ్లుగా మూత్రశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొత్తగా వచ్చిన ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రశాంతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దాతల సహకారం తనవంతు ప్రయత్నాలు చేశారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను సంగారెడ్డికి చెందిన నలుగురు ప్రముఖులకు ఆమె వివరించారు. స్పందించిన దాతలు రూ.55 వేలు వెచ్చించి పాఠశాలలోనే బాలుర శౌచాలయాల నిర్మించి అప్పగించారు. శౌచాలయాల ఏర్పాటుపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేయగా, దాతలకు ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి కృతజ్ఞతలు తెలిపారు.


పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన శౌచాలయాలు

మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన

జోగిపేట/నారాయణఖేడ్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజాయుద్ధ నౌక గద్దర్‌ను అవమానిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అందోలు మల్లేశం, మండలాధ్యక్షుడు బహుజన ప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఇందులో మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్ మేతరి, నాయకులు పాల్గొన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని అంబేడ్కర్ యువజన సంఘం నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు గణపతి, ఉపాధ్యక్షుడు బస్వరాజ్ డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ బైక్ ర్యాలీ

పుల్‌కల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ క్యాంపస్‌లో బుధవారం బైక్ ర్యాలీ చేపట్టారు. ఉద్యోగ భద్రత లేకుండా ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ సరైన వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రతతో కూడిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పంద కార్మికుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జె.సాయిచంద్ర, ఇతర విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్, కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశోక్

జిన్నారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గడ్డపోతారం మాజీ సర్పంచ్ ఎంపీ.అశోక్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు. బీసీల సంక్షేమం, ఐక్యత కోసం రాష్ట్ర సంఘం నాయకులు కృషి చేయాలని కృష్ణయ్య అన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.


ఎంపీ అశోక్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

శివాలయం భూములు రక్షించాలని ధర్నా

జిన్నారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిన్నారంలో శివాలయం కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదంటూ స్థానికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సర్వే నెంబరు 58లో ఉన్న ప్రైవేటు భూమి యజమానులు పక్కనే ఉన్న సర్వే నెంబరు 1లోని ఆలయ భూ అక్రమణ కోసం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సర్వే జరిపి హద్దులు నిర్ధారించాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు కలిసి ఫిర్యాదు చేసినా, చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వెంటనే ఆలయ భూమిని గుర్తిస్తూ హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పెరిగిన ఐడీఏబొల్లారం మున్సిపల్ ఆదాయం

ఐడీఏబొల్లారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం మున్సిపల్ ఆదాయం పెరిగింది. గతేడాది వరకు రూ.8 కోట్లుగా ఉన్న ఆదాయం ఒక్కసారిగా రూ.16.8 కోట్లకు చేరింది. పరిశ్రమల్లో ఇటీవల కొత్త నిర్మాణాలు జరిగాయి. అనుమతులు ఉన్నా, లేకున్నానిర్మాణాలు చేపట్టారు. వాటన్నింటిని పరిగణలోకి తీసుకున్నారు. అన్నింటికి పూర్తిస్థాయి కొలతలు వేసి పన్ను మదింపు చేశారు. ఫలితంగా ఒక్క పారిశ్రామికవాడ నుంచి రూ.6 కోట్లు ఆదాయం అదనంగా వచ్చింది. గతంలో రూ.3 కోట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి రూ.9.8 కోట్లు ఆదాయం వచ్చింది. మిగిలిన రూ.6.5 కోట్లు గృహాల నుంచి వసూలు చేస్తున్నారు. ఇప్పటికే 61 శాతం వసూలు చేశామని కమిషనర్ మంగతాయారు చెప్పారు.


మనూరు మండలం బోరంచలో రుద్రహోమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన సతీమణి అనుపమ్మరెడ్డి


గుమ్మడిదల: బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న పండితులు


చిలప్‌చెడ్ : చాముండేశ్వరీ ఆలయం వద్ద మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఘనంగా మాఘ అమావాస్య

మాఘ అమావాస్య సందర్భంగా బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కోర్కెలు ఈడ్చేరమని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్


పెద్దశంకరంపేట మండలం కొప్పోల్‌లోని కోనేటిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు